'గాయత్రి'లో 12న జాబ్‌మేళా

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఈ నెల 12న ఫార్మా కంపెనీ ఫైజర్ ఆధ్వర్యాన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ పివికె మణికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021, 2022లో ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఎంపిసి, బైపిసిలో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 20 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లు, డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న వారు మొదటి ఏడాది ధ్రువపత్రాలతోపాటు మూడు సెట్లు జిరాక్స్ కాపీలు, మూడు ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి నెలకు రూ.12,500 జీతంతోపాటు ప్రముఖ విశ్వవిద్యాలయంలో డిగ్రీ విద్యను కూడా ఉచితంగా చదివిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 8919182007 నంబరును సంప్రదించాలని కోరారు.

కమ్ముకున్న మబ్బులు

రైతుల్లో గుబులు

వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో రైతుల్లో గుబులు నెలకొంది. జిల్లాలో వరిపంట కోత దశకు రావడంతో అనేకచోట్ల రైతులు కోతలు ప్రారంభించారు. కొన్నిచోట్ల ముమ్మరంగా కోతలు సాగుతున్నాయి. ఇలాంటి తరుణంలో అల్పపీడన ప్రభావంతో మబ్బులు కాయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

- అల్పపీడనంతో మారిన వాతావరణం
- పొలంలోనే కోసేసిన వరిపంట
- కుప్పలు వేస్తున్న రైతన్నలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం 3.21 లక్షల ఎకరాలు. ఖరీఫ్ సీజన్లో 1.71 లక్షల ఎకరాల్లో వరిసాగైంది. దాదాపు 90శాతం వరకు పంట కోత దశకు వచ్చింది. ఇప్పటికే పాలకొండ, సీతంపేట, కొమరాడ, పార్వతీపుర,ం సీతానగరం, బలిజిపేట మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇలాంటి తరుణంలో అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు రావడం, కోసేసిన వరిపంట పొలంలోనే ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే వరిపంటకు తీవ్ర నష్టం వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే వాతావరణ శాఖ హెచ్చరికలతో కోతలు ఆరంభించడానికి రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికే కోసిన వారు పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గత ఏడాది చేదు అనుభవాలను గుర్తుకు చేసుకుంటూ మారిన వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు కోసం ఎదురుచూపు

వరిపంట కోత దశకు రావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో పంట పొలాల్లోనే కుప్పలు వేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధి హామీకి కేంద్రం తూట్లు

- వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి
- వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు డి.సుబ్బారావు పిలుపు

మహాసభలో మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-మక్కువ

2006లో వామపక్షాల చొరవతో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.సుబ్బారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధి హామీని ఎత్తి వేసేందుకు కుటిలయత్నాలు సాగిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం పార్వతీపురం మన్యం జిల్లా 9వ మహాసభను వ్యకాస జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరరావు అధ్యక్షతన మక్కువలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం కామ్రేడ్ రెడ్డి శ్రీరామ్మూర్తికి సభ నివాళులర్పించింది. అనంతరం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థలకు దాసోహమై కార్మిక, కర్షక, ప్రజల ప్రయోజనాలను పక్కన పెడుతోందని విమర్శించారు. పోరాటాలతో సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని నీరుగారుస్తూ, పెత్తందారులకు అనుకూలంగా చట్టాలను సవరించడం దుర్మార్గమన్నారు. ప్రతి సంవత్సరం వ్యవస్థను ప్రయివేటీకరించే దిశగా అడుగులు వేస్తూ, పెట్టుబడిదారులకు ప్రభుత్వ ఆస్తులను అప్పగించేలా మోడీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ఎదిరించే స్థితిలో లేదని, మోడీకి వంతపాడేలా తయారైందని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వీటిని ఐక్య పోరాటాల ద్వారానే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆరు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఉపాధ్యక్షులు సిహెచ్ నాయుడు, సిఐటియు రాష్ట్ర నాయకులు రెడ్డి వేణు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా వ్యకాస జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగునాయుడు, ఉపాధ్యక్షులుగా చింతల తవిటినాయుడు ఎన్నికయ్యారు. ఈసారి జిల్లా కార్యవర్గంలో కొత్తగా ముగ్గురిని చేర్చుకున్నట్లు అధ్యక్షులు ఈశ్వరరావు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆనంద్

సామగ్రి సరఫరాలో జాప్యమొద్దు

జెసి ఆనంద్

ప్రజాశక్తి-కలెక్టరేట్

నాడు-నేడు పనులకు నిర్మాణ సామగ్రి సరఫరాలో జాప్యం చేయొద్దని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నాడు-నేడు పనుల పురోగతిపై జిల్లా అధికారులతో బుధవారం జెసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న నాడు-నేడు పనులకు బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామని, పనుల పురోగతి సాధించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి అధ్యక్షతన సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, గనుల శాఖ అధికారులు బృందంగా ఏర్పడి ప్రతిరోజూ నాడు-నేడు పనులపై చర్చించి సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని ఆయన సూచించారు.

పార్వతీపురం మండలంలో పనులు ఎక్కువగా ఉన్నందున దగ్గరలో ఉన్న క్రషర్ నుండి మెటల్ కేటాయింపు చేయాలని అధికారులను ఆదేశించారు. క్రషర్స్ యజమానులకు ఇబ్బంది లేకుండా ధర నిర్ణయించినా పనుల జాప్యం పట్ల ప్రశ్నించారు. క్రషర్ వారీగా జరుగుతున్న సరఫరాల పట్ల నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. మెటల్ సరఫరాలో జియ్యమ్మ వలస, కురుపాం మండలాలు వెనుకబడి ఉన్నాయని, పురోగతి సాధించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలు కచ్చితంగా పూర్తి చేయాల్సిందేనని అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో 55 క్వారీలు, 14 క్రషర్లు ఉండగా, 30 క్వారీలు పనిచేస్తున్నా సరఫరాలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఇఒ ఎస్.డి.వి రమణ, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, గనుల శాఖ అధికారి చంద్ర నాయక్, క్రషర్స్, క్వారీల యజమానులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

నియోజకవర్గ క్రీడా పోటీల ప్రారంభంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-సాలూరు

క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు, యువకులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని పిఎన్ బొడ్డవలసలో గురుకుల బాలుర పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. క్రీడల్లో ప్రతిభా పాటవాలు కనబరచడానికి ఆకాశమే హద్దుగా వుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలయోగి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వికలాంగురాలికి పూర్తి పింఛను అందించాలి

మానసిక, శారీరక వికలాంగురాలైన కందుకూరి సుందరమ్మకి పూర్తి స్థాయిలో పింఛను మంజూరు చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని 20 వార్డులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మానసిక శారీరక వికలాంగురాలైన కందుకూరి సుందరమ్మకు ఐదువేల రూపాయల పింఛను మంజూరు చేయాలని ఆమె బంధువులు ఆయన్ను కోరారు. వెంటనే వికలాంగురాలిని పరిశీలించి అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. సుందరమ్మ ఐదువేల రూపాయల పింఛను పొందేందుకు అర్హురాలని ఆయన అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ పిరిడి రామకృష్ణ పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి-సాలూరు

బైజూస్ యాప్ ఇన్‌స్టాల్ చేయని ప్రధానోపాధ్యాయులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులు రద్దు చేయాలని ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జె.పైడిరాజు కోరారు. బుధవారం ఆయన ఆధ్వర్యాన ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం నాయకులు డిఇఒ రమణకి వినతిపత్రం అందజేశారు. ముందుగా ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జెండావిష్కరణ చేపట్టారు. కార్యక్రమంలో సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎం.అమర్‌నాథ్ పాల్గొన్నారు.

వయోపరిమితిని 45 ఏళ్లకు పెంచాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితిని 45 ఏళ్లకు పెంపుదల చేయాలని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వయోపరిమితి 42 ఏళ్లుగా ఉందని చెప్పారు. ఉద్యోగ నోటిఫికేషన్లు పెద్దగా లేకపోవడంతో నిరుద్యోగ యువత నష్టపోతున్నారని తెలిపారు. తెలంగాణలో వయోపరిమితి 45 ఏళ్లు చేశారని, అదే మాదిరిగా మన రాష్ట్రంలో కూడా వయోపరిమితి పెంచాలని కోరారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి

పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి-సీలేరు

విలేకర్లతో మాట్లాడుతున్న రమాప్రభ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. బుధవారం సీలేరు వచ్చిన ఆమె పట్టభద్రులను కలిసి తనకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో ఉన్న జీవ నదులపై ప్రాజెక్టులు నిర్మించకపోవడం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటుకు కారణమని చెప్పారు. దీంతో ఇక్కడ పనుల్లేక రైతులు కూలీలు వలసబాట పడుతున్నారన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి దశాబ్దాలు గడిచినా నేటికీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఇక్కడున్న పట్టభద్రులు వేరే పట్టణాలకు వలస పోతున్నారన్నారు. వలసలను అరికట్టడానికి కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంతో పాటు ఉపాధి ఇస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే శాసనమండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తానని, ఈ ప్రాంతంలో పోరాడే వారి తరుపున నిలబడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, గాలకొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు పాల్గొన్నారు.

గిరిజనులను విస్మరించిన ప్రభుత్వం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

గిరిజనాభివృద్ధిని వైసిపి ప్రభుత్వం విస్మరించిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి విమర్శించారు. టిడిపి మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం పూడి, నందేడివలస, పనుకువలస గ్రామాల్లో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందేడివలస వారపు సంతకు వచ్చిన గిరిజనులతో ఆమె మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు ఆమె తెలిపారు. సబ్సిడీపై గిరిజన రైతులకు పరికరాలు, బ్యాంకు రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. వైసిపి మూడున్నరేళ్ల పాలనలో గిరిజనుల అభివృద్ధి పూర్తిగా కుంటిపడిందన్నారు. ఐటిడిఎను పూర్తిగా నిర్వీర్యం చేసి గిరిజనులకు రావలసిన నిధులను పక్కదారి పట్టించారని విమర్శించారు. కార్యక్రమంలో పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్, ముఖి సూర్యనారాయణ, పల్లెడ ఉమామహేశ్వరరావు, కె.సురేష్, చల్ల కనక, తదితరులు పాల్గొన్నారు.

కొండపైకి నడుచుకుంటూ వెళ్తున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

26, 27న ఎస్ఎఫ్‌ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా 30వ మహాసభను ఈ నెల 26, 27వ తేదీల్లో పార్వతీపురంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ తెలిపారు. జిల్లా మహాసభలకు సంబందించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం అమలు వల్ల దేశంలో విద్య అంగట్లో సరుకులా మారిందన్నారు. విద్యా కాషాయీకరణే ప్రధాన లక్ష్యంగా కేంద్రం పనిచేస్తోందన్నారు. దానికి అనుగుణంగానే రాష్ట్రంలో 117 జిఒ అమలు, బైజూస్ ఒప్పందమని తెలిపారు. రాజ్యాంగంలో విద్య ఒక ప్రాథమిక హక్కని, దానిని ప్రభుత్వం బాధ్యతగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలో గత పోరాటాలను, లోపాలను సమీక్షించి భవిష్యత్ విద్యా రంగ అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించనున్నట్లు తెలిపారు.

ఈ మహాసభలను జయప్రదం చేయాలని విద్యార్థులను, మేధావులను, అభ్యుదయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.భాస్కర్, సిహెచ్. సింహాచలం, సభ్యులు ఎం.కృపానంద్, చిన్నారి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌టిల డెప్యుటేషన్ రద్దుచేయాలి

ఐటిడిఎ పిఒని కోరిన ఆదివాసీ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-సాలూరు

ఐటిడిఎ పరిధిలోని మండలాల్లో సిఆర్‌టిల అక్రమ డెప్యుటేషన్లు రద్దు చేయాలని ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జె.పైడిరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆధ్వర్యాన ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఐటిడిఎ పిఒ శ్రీవిష్ణు చరణ్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఆర్‌టిల కౌన్సిలింగ్‌లో కేటాయించిన పాఠశాలల నుంచి వారిని మైదాన ప్రాంత పాఠశాలలకు డెప్యుటేషన్ చేయడం వల్ల ఆయా జిపిఎస్‌లో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. అక్రమ డెప్యుటేషన్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన హెచ్‌ఎం కృష్ణారావుని సస్పెండ్ చేయాలని కోరారు. రెండు నెలలైనా అధికారులు విచారణ పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. దీనిపై ఐటిడిఎ పిఒ స్పందిస్తూ విచారణ నివేదిక ఇంకా అందలేదని, అందిన వెంటనే తగిన చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి టి.సత్యనారాయణ, నాయకులు జె.ముత్యాలు పాల్గొన్నారు.

తవ్వేస్తున్నారు.. వదిలేస్తున్నారు

అధ్వాన్నంగా తవ్వేసిన రోడ్డు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో బంధం వారి వీధిలో ఉన్న బిటి రోడ్‌ను తవ్వివదిలేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. అదే వీధిలో ఉన్న ఒక నివాసానికి తాగునీటి కుళాయి పైపులైన్ వేసేందుకు ప్రయివేట్ సిబ్బంది రోడ్డును తవ్వారు. పైప్‌లైన్ వేసిన తరువాత కూడా సంబంధిత ఇంటి యజమాని బిటి రోడ్డుకు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీంతో ఆ రహదారిలో రాకపోకలు సాగిస్తున్న వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భూకబ్జాలపై చర్యలేవీ?

ప్రజాశక్తి-కొమరాడ

మండల కేంద్రంలో భూములు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొమరాడ సర్పంచ్ సిరికి గంగమ్మ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ విలేకరులతో మాట్లాడారు. సచివాలయానికి ఆనుకుని ఉన్న సర్వే నెంబరు 110/2, 110/1, 103/1,2,3,4లోని భూములను, చెరువును కొందరు వ్యక్తులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డులు మార్పించారని ఆరోపించారు. దీనిపై తహశీల్దార్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను అధికారుల చేతివాటంతో రికార్డులు మార్పులు చేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఏకంగా జెసిబి సహాయంతో చెరువును కప్పి వేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కొమరాడ పిఎసిఎస్ చైర్మన్ ఎం.సూరపునాయుడు, వైసిపి నాయకులు ఎం.సింహాచలం నాయుడు, ఉప సర్పంచ్ చిన్నసుధ పాల్గొన్నారు.

భూముల రీసర్వే పరిశీలన

వీరఘట్టం : రైతుల నుండి ఎటువంటి ఫిర్యాదులూ రాకుండా సమగ్ర భూ రీసర్వే చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ సర్వేయర్లను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బిటివాడ, ఆడారు గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో త్వరితగతిన జగనన్న సమగ్ర భూ రీసర్వే పూర్తిచేయాలని సిబ్బంది ఆదేశించారు. సర్వేలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. రైతులకు సమన్యాయం జరిగేలా సర్వే చేపట్టాలని అధికారులు ఆదేశించారు. సర్వే మ్యాపును పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.మాధవి, ఎంఆర్ఐ కృష్ణారావు, ఆర్.శ్రీనివాసరావు, గ్రామ నాయకులు సత్యంనాయుడు, గణపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పయ్యపేటలో డ్రోన్ సర్వే

సీతానగరం : మండలంలోని పెదబోగిలి మేజర్ పంచాయతీలో భూ సర్వే నిమిత్తం బుధవారం డ్రోన్ సర్వేను తహశీల్దార్ ఎం.వి.రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ తెరీజమ్మ, ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్, వార్డు సభ్యులు రామారావు, కో ఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు ఆర్‌వి పార్థసారథి, ఇఒ జె.వెంకటరావు, రెవెనకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు భామిని విద్యార్థులు

భామిని : రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు భామిని కెజిబివి విద్యార్థులు ఎంపికైనట్లు ఎస్ఒ శారద తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎన్.మౌనిక, వి.శ్రావణి, ఎన్.ఉదయశ్రీ, కె.లక్ష్మి, ఎం.అంకిత, కె.సరితను, త్రోబాల్ పోటీలకు ఎంపికైన గీతాలక్ష్మిని ఎస్ఒతోపాటు కెజిబివి సిబ్బంది అభినందించారు.

ఏజెన్సీలో గడపగడపకు మన జిసిసి

గుమ్మలక్ష్మీపురం : ప్రజలకు నిత్యావసర సరుకులతోపాటు గిరిజన సహకార సంస్థ తయారుచేసిన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని ఉద్దేశంతో ఆ సంస్థ అధికారులు గడపగడపకు మన జిసిసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం మొబైల్ వ్యాన్ ద్వారా గ్రామాల్లోకి నేరుగా వెళ్లి నిత్యావసర సరుకులను, జిసిసి ఉత్పత్తులను జిసిసి మేనేజర్ కృష్ణప్రసాద్, అకౌంటెంట్ సాంబశివరావు స్వయంగా అమ్మకాలు చేపట్టారు.

గ్రామాల్లో మత్స్య సాగుబడి

పార్వతీపురంరూరల్ : మండలంలోని నరిసిపురం, పెదబొండపల్లి గ్రామాల్లో మత్స్యశాఖ జిల్లా అధికారి మేముల తిరుపతయ్య ఆధ్వర్యంలో బుధవారం మత్స్య సాగుబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

చినబొండపల్లిలో ఉపాధి పనుల గుర్తింపు

పార్వతీపురంరూరల్ : మండలంలోని చినబొండపల్లిలో బుధవారం సర్పంచ్ గండి శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులు గుర్తించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ చంద్రమ్మ మాట్లాడుతూ రూ.2.56 కోట్ల విలువైన పనులు గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలో చెత్తశుద్ధి కేంద్రానికి స్థలం గుర్తించారు. పనులు త్వరగా చేపట్టి, అందుబాటులోకి తీసుకురావాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బంకురు రవికుమార్, ఎపిఒ భాను, గ్రామకార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

గ్రామంలో ర్యాలీ చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, టిడిపి నాయకులు

అప్పయ్యపేటలో బాదుడే బాదుడే

సీతానగరం : మండలంలోని అప్పయ్యపేటలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో బాదుడే బాదుడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దౌర్జన్యాలు అధికమయ్యాయని చెప్పారు. మరోవైపు ధరలు విపరీతంగా పెంచడంతో ప్రజలు దుర్భర జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల కాలంలో అకాలవర్షాలతో నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం అందించలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, ఆర్.వేణుగోపాల్ నాయుడు, నాయకులు ఎస్.హరిగోపాల్ రావు, ఎస్.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు గొట్టాపు వెంకటనాయుడు, గర్భాపు ఉదయభాను, టి.తిరుపతిరావు, వి.పారినాయుడు, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

బగ్గందొరవలసలో ఫ్యామిలీ డాక్టర్

సీతానగరం : మండలంలోని బగ్గందొరవలస గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని 104 డాక్టర్ వంశీబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రమాదవశాత్తూ మంచానికే పరిమితం అయిన ఉత్తరవిల్లి అప్పలనాయుడు ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. అంగన్వాడీ పిల్లలకు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, భారతీ, సరస్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులను ఆదుకోవాలి

సాలూరు: జిల్లాలోని నాయీబ్రాహ్మణులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సాలూరు ఏరియా నాయీ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు కొయ్యాన శ్రీనివాసరావు, నాయకులు కె.రాము, పి.కోటేశ్వరరావు, తాడి సతీష్ కోరారు. బుధవారం వారు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కాస్మోటిక్స్ ధరలు భారీగా పెరిగినందున సెలూన్ షాపుల నిర్వహణ భారంగా మారిందని చెప్పారు. సొంత షాపులు లేక చాలామంది అద్దెషాపుల్లో నడుపుతున్నారని చెప్పారు. కరెంటు బిల్లులు కట్టలేక నిర్వహణ భారంగా తయారైందని ఆవేదన వ్యక్తంచేశారు.

జంపరకోట సచివాలయ సందర్శన

పాలకొండ రూరల్ : మండలంలో జంపరకోట సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాథులు బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. అన్నవరం, అంపిలి, గోపాలపురం గ్రామాల్లో ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం తీసుకురావాలన్నారు. అన్నవరంలో చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించారు. నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ రాగోలు శ్రీనివాసరావు మరణించడంతో దహన సంస్కరణ ఖర్చుల కింద రూ.10వేలను ఆయన భార్య శ్రీలక్ష్మికి అందించారు.

చెత్తశుద్ధి కేంద్రం పరిశీలన

సీతానగరం : మండలంలోని జానుమల్లువలసలో ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రం నిర్వహణను ఇఒపిఆర్‌డి వర్మ బుధవారం పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వెంకటినాయుడు, పంచాయతీ కార్యదర్శిని కోరారు. అనంతరం దయానిధిపురం సచివాలయాన్ని సందర్శించారు. హాజరుపట్టికను పరిశీలించారు. వాలంటీర్లంతా తప్పనిసరిగా ప్రతిరోజూ సచివాలయంలో హాజరు నమోదు చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

బాలేరులో వైద్య శిబిరం

భామిని : మండలంలోని బాలేరులో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 140 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో బాలేరు ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ పాల్గొన్నారు.

కళలను కాపాడుతున్న భజనల బృందాలు

సీతానగరం : అంతరించిపోతున్న కళలను కాపాడటంలో భజనల బృందాలు చేస్తున్న కృషి గొప్పదని టిడిపి నాయకులు బేబినాయన తెలిపారు. బుధవారం మండలంలోని జోగమ్మపేట గ్రామంలో మక్కువ మాజీ ఎంపిపి పెంట తిరుపతిరావు, కర్రి రాములు ఏర్పాటు చేసిన కార్తీకమాస అన్న సంతర్పణ కార్యక్రమం, భజన బృందాల కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబినాయనను, పెంట తిరుపతిరావును గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా నేత మర్రాపు సురేష్, సర్పంచ్ కల్యంపూడి సింహాచలం, కొల్లి తిరుపతిరావు, పోల ఈశ్వరనారాయణ, పోల వెంకటనాయుడు, వెంకటరమణ పంతులు, సురేష్, సబ్బాన శ్రీనివాసరావు, లక్ష్మణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

సీతంపేట : వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నబగ్గ పంచాయతీలో మోహన కాలనీ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు. ఇందులో ప్రకృతి వ్యవసాయం ఉద్దేశం, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వల్ల నష్టాలు, ఆహార అలవాట్లు, తదితర వాటిపై ఆర్‌పి పి.నాగేశ్వరరావు వివరించారు. చిరుధాన్యాలు వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు కార్య దర్శి బి.సంజీవరావు, వెన్నెల, పార్వతీ, ఎపిసిఎన్ఎఫ్ సభ్యులు బాలు, శివ పాల్గొన్నారు.

నేడు వెంకట బైరిపురంలో గడపగడపకు..

మక్కువ : మండలంలోని వెంకట బైరిపురం పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ దేవ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు విధిగా హాజరు కావాలని కోరారు.

ఓటు హక్కు వజ్రాయుధం

డిఆర్ఒ వెంకటరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్‌సిఎం స్కూల్ ఆవరణలో ఓటుహక్కు నమోదుపై అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. ఆర్‌సిఎం స్కూల్ నుండి మూడు రోడ్ల జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి కీలకమని అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో అతిపెద్ద పాత్ర ఓటర్లదన్నారు. బాధ్యతగల ప్రతి పౌరుడు విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. దేశాభివృద్ధికి, పటిష్ట ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు ఎంతో కీలకమని అన్నారు. యువత నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి ఓటుహక్కు వినియోగించుకొనేలా చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.హేమలత, డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు, ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయ అధికారి ధవళ భాస్కరరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిఇఒ ఎస్.డి.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జి.వరహాలు, జిల్లా ప్రజా రవాణా అధికారి టి.వి.ఎస్.సుధాకర్, క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాం, కలెక్టరేట్ ఎఒ ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రణాళిక అధికారి వీర్రాజు, జిల్లా భూగర్భ జలాల అధికారి కె.రాజశేఖర రెడ్డి, తహశీల్దార్ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ఓట్ల నమోదు కార్యక్రమంపై తహశీల్దార్ ఎస్.నరసింహమూర్తి సీతంపేట సంత మార్కెట్ నుంచి ఐటిడిఎ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి శ్రీనివాసరావు, ఆర్ఐ వెంకటేష్, రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భామిని : తహశీల్దార్ అప్పారావు ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైకెపి, ఉపాధి హామీ సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓటర్ నమోదుపై అవగాహన కలిగించారు.

కురుపాం : స్థానిక పెట్రోల్ బంక్ నుంచి బస్టాండ్ వరకు తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ ఆధ్వర్యాన కిశోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో వీరఘట్టంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో విఆర్‌ఒలు అప్పలనాయుడు, సురేష్ కుమార్, దుర్గారావు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : స్థానిక డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో బుధవారం స్వీప్ యాక్టివిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జనార్ధన నాయుడు, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రభాకర్, కో-ఆర్డినేటర్ బి.రాజు ఉన్నారు. ఎం.సింగుపురం గ్రామంలో ఓటుహక్కు నమోదుపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రణస్థలం రాంబాబు మాట్లాడుతూ ఓటుహక్కు ద్వారానే మన ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ప్రొటక్షన్ కార్యదర్శి లావణ్య ఉన్నారు.

కలెక్టరేట్.. మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకటరావు

సీతంపేట, కురుపాంలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్న అధికారులు

మహాప్రదర్శన విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి-పాచిపెంట

పార్వతీపురంలో గురువారం జరిగే రైతు మహాప్రదర్శనను విజయవంతం చేయాలని రైతు, గిరిజన సంఘాల ఆధ్వర్యాన బుధవారం మండలంలోని కుడుమూరు, మెట్టవలస ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి గిరిజన సంఘం మండల అధ్యక్షులు సుకురు అప్పలస్వామి మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దగడ్డ ఎడమ కాలువ నిర్మాణం చేపట్టాలని, మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై చేపట్టే రైతు మహాప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్ర కళ్యాణ్, గెమిల పోతయ్య పాల్గొన్నారు.

పాచిపెంట.. పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురంలో గురువారం చేపట్టే రైతు మహాప్రదర్శనను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు కోలక అవినాష్ కోరారు. గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన సంఘం కార్యాలయంలో బుధవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరకు రైతుల బకాయిలు చెల్లించాలని, సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెముడుగూడ ఎంపిటిసి ఎం.రమణ, గిరిజన సంఘం నాయకులు సన్యాసిరావు పాల్గొన్నారు.


చంద్రబాబుతో భేటీ అయిన నిమ్మక జయకృష్ణ

చంద్రబాబుతో నిమ్మక భేటీ

ప్రజాశక్తి-పాలకొండ

ఉండవల్లిలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ బుధవారం భేటీ అయ్యారు. నియోజకవర్గంలో పార్టీ, రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని జయకృష్ణకు ఆయన సూచించారు.

న్యాయం అందరికీ సమానం

ప్రజాశక్తి-పాలకొండ

సమాజంలో న్యాయం అందరికీ ఒకేలా వర్తిస్తుందని జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ అడ్డాల విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఇటువంటి సదస్సులకు హాజరై చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యువత మంచిమార్గంలో నడవాలని, క్రిమినల్ కేసులకు దూరంగా ఉండాలన్నారు. న్యాయవిజ్ఞాన కేంద్రాలు ద్వారా న్యాయాన్ని సాధించుకోవచ్చున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రౌతు సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శీమల కృష్ణారావు, కర్రా రవి, ఎన్ని రాజు, గోవిందరాజులు, శివప్రసాద్, బత్తిన మోహన్, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : స్థానిక సబ్‌జైల్‌లో ఖైదీలకు మండల న్యాయసేవా కమిటి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. అడిషన్ జిల్లా మున్సిఫ్ మెజిస్ట్రేట్ డి.సౌజన్యకుమారి మాట్లడుతూ క్షణికావేశంలో తప్పులు చేస్తే జీవితాంతం శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. చెడు ప్రవర్తన వల్ల వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబమంతా తలదించుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం సీనియర్ న్యాయవాది టి.జోగారావు, ఎస్.ఉమామహేశ్వరరావు పలు చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంటు అప్పలనారాయణ పాల్గొన్నారు.

పాలకొండ.. మాట్లాడుతున్న జడ్జి విజయ్‌రాజ్‌కుమార్

కురుపాం : స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో న్యాయ సేవల వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో న్యాయమూర్తి ఇ.ఆంజనేయులు మాట్లాడుతూ పేదల ఇళ్లకు వెళ్లి న్యాయ సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. లోక్ అదాలత్, కేసుల సత్వర పరిష్కారం, ఇంటింటా న్యాయ సేవల ప్రచారం గురించి వివరించారు. ఈ నెల 12న జరిగే మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది బరాటం చంద్రమౌళి, లోక్ అదాలత్ సభ్యులు గౌతారి వెంకటరావు, పేరా లీగల్ వాలంటీర్లు అంధవరపు కోటేశ్వరరావు, మోనంగి పృథ్వీరాజ్, బాలసింగి గోవింద, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడుతో కురుపాం నియోజకవర్గంలోని టిడిపి నాయకులు

అయ్యన్నకు కురుపాం నాయకుల సంఘీభావం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం,కురుపాం

టిడిపి సీనియర్ నాయకులు చింతకాయల అయ్యన్న పాత్రుడును బుధవారం నర్సీపట్నంలోని ఆయన నివాసం వద్ద కురుపాం నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు సంఘీభావం తెలిపారు. కురుపాం నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు, ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి బిడ్డక తమ్మయ్య, నాయకులు బిడ్డక పద్మావతి, పువ్వల లావణ్య, శ్రీరామ భూపతి దొర, రాజపు విజయ్ కుమార్, మరడాన వెంకటనాయుడు, మీసాల శశిభూషణ్‌రావు, రామారావు, సతివాడ శంకరరావు, హిమరక నారాయణ, శ్రీనివాస్, రాగాల అప్పలకొండ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -భామిని

అర్హులైన ప్రతిఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించటమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. భామిని మండలం బొడ్డగూడ పంచాయతీ పరిధిలో సన్నాయ్‌కాలనీ, బంద్రాసింగి, కడంబాసింగి, కోటకొండ, సవరపాడు గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. అర్హులైన వారికి పథకాలు అందించే బాధ్యత స్థానిక సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. అర్హత ఉండి కూడా రాకపోతే, దానికి కారణాలు తెలిపి, రావటానికి ఏమి చెయ్యాలో అనే అంశం వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, మజ్జి మోహన్ బాబు, బొడ్డగూడ సర్పంచ్ బిడ్డికి మార్తా, కొండగొర్రి చంటి, వైసిపి నాయకులు కొవ్వాడ చిరంజీవులు, గెల్లంకి రమేష్, అనంతరావు, కాగితపల్లి క్రిష్ణ పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

విద్యుత్తు శాఖ సూచనలు పాటించాల్సిందే

ప్రజాశక్తి-సీతానగరం

వినియోగదారులు విద్యుత్తు శాఖ సూచనలు పాటించాలని ఆ శాఖ ఎఇ కె.సోమేశ్వరరావు అన్నారు. స్థానిక పెదబోగిలి పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం వినియోగదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో వినియోగించే ప్రతి వైరు మంచిది వాడాలని, ఐఎస్ఐ ముద్రగలిగిన స్విచ్చులు, బోర్డులు, బల్బులు ఉపయోగించాలని సూచించారు. తడి చేతులతో స్విచ్చులు ఆన్ చేయరాదన్నారు. కార్యక్రమంలో ఇఒ జయ వెంకటరమణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-సీతానగరం

జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి లబ్ధిదారులను కోరారు. బుధవారం మండలంలోని కాశీపేట గ్రామ సచివాలయంలో లబ్ధిదారులు, సచివాలయ సిబ్బందితో గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను డిసెంబర్ 21 నాటికి పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుని, పరిష్కరించే దిశగా అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. అందుకు అధికారులతో మాట్లాడతామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఎఇ సిహెచ్ జానకిరామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, కృష్ణ, పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కొత్త కార్యవర్గం

మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు

సాలూరు : మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో యూనియన్ ప్రస్తుత అధ్యక్షులు ఎస్ఎఫ్ అహ్మద్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యులుగా మున్సిపల్ మేనేజర్ పివిటి రాఘవాచార్యులు, అధ్యక్షులుగా ఎస్ఎఫ్ అహ్మద్ రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎంవి రమణ, ఎండి నూర్జహాన్ బేగం, కార్యదర్శిగా పివివిఎస్-ఎస్ సంజయ్ పట్నాయక్ ఎన్నికయ్యారు. రెండోసారి అధ్యక్షునిగా ఎన్నికైన అహ్మద్‌ని, ఇతర నాయకులను మున్సిపల్ ఉద్యోగులు అభినందించారు.

పెద్దూరు సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని పెద్దూరు సచివాలయాన్ని డిఎల్‌డిఒ వివి గోపాల్‌కృష్ణ.. బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ప్రజలకు ఎన్ని సర్వీసులు రోజుకు ఇస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీలైనన్ని ఎక్కువ సేవలు అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వం పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ వాలంటీర్లు బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. మహిళా పోలీసులు నెలలో మూడో శుక్రవారం బాలికల పాఠశాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపిడిఒ కె.గీతాంజలి పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

భవనాలకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి దీనమయ్య

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపిపి కుంబిరిక దీనమయ్య అన్నారు. మండలంలో వంగర గిరిజన గ్రామంలో అంగన్వాడి, పాఠశాల భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్ల నుంచి విద్యార్థులు ఉండి చదువుకునేందుకు సరైన భవనాలు లేకపోవడంతో ప్రభుత్వం గుర్తించి నూతన భవనాలను మంజూరు చేసిందని తెలిపారు. ఈ భవన నిర్మాణాలతో విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్యా బోధన అందుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భద్రగిరి ఐసిడిఎస్ సిడిపిఒ ఈశ్వరమ్మ, ఉపాధ్యాయులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ మన్మథరావు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - కురుపాం

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహద పడతాయని నీలకంఠపురం సర్పంచ్ ఎ.మన్మథరావు అన్నారు. బుధవారం మండలంలోని నీలకంఠపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా మంచి ప్రతిభ కనబరచాలని చెప్పారు. క్రీడల వల్ల ఆరోగ్యం కూడా బాగుండి మానసికంగా ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకట్రావు, వైస్ ఎంపిపిలు రంగారావు, అన్నాజీరావు , వైసిపి నాయకులు ఐ.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని కొటికిపెంట పంచాయతీ కొత్తవలస గ్రామానికి చెందిన మల్లూరి సూర్యనారాయణ (54) పురుగుల మందు తాగి మంగళవారం రాత్రి మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ కృపారావు కథనం ప్రకారం.. బాడంగి మండలం కోటిపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ బంధువులైన సత్యం, నారాయణరావు ఇళ్లకు మంగళవారం వచ్చాడు. ఈ నేపథ్యంలో ముగ్గురు కలిసి సారా తాగారు. ఈ క్రమంలో సూర్యనారాయణ తమ చిన్న కూతురు పెళ్లికి కోటిపల్లిలో తమకు ఉన్న వాటా ప్రకారం ఆర్థిక సహాయం అందించాలని వారిని కోరాడు. కోటిపల్లిలో ఎటువంటి హక్కూ లేదని, ఆర్థిక సహాయం చేయబోమని వరుసకు కొడుకైన నారాయణరావు చెప్పుతో సూర్యనారాయణని కొట్టాడు. దీంతో సూర్యనారాయణ మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. స్పృహ తప్పిపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు గుర్తించి పాచిపెంట పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సాలూరు సిహెచ్‌సికి తరలించి వైద్యం అందిస్తుండగా మంగళవారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి కృపారావు తెలిపారు.

సారా ప్యాకింగ్ కేంద్రంపై దాడి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పనసభద్ర గ్రామ సమీపంలో సారా ప్యాకింగ్ కేంద్రంపై బుధవారం ఎస్ఇబి అధికారులు దాడి చేశారు. 440 లీటర్ల సారా, 600 ప్యాకెట్లు, ప్యాకింగ్ మెషీన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఇబి సిఐ ఉపేంద్ర తెలిపారు. అదే గ్రామానికి చెందిన కోలక కృష్ణను అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రమేయమున్న మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ శేఖరం, సిబ్బంది పాల్గొన్నారు.

7511 లీటర్ల సారా ధ్వంసం

ప్రజాశక్తి-సాలూరు

నియోజకవర్గ పరిధిలోని పాచిపెంట, మక్కువ, సాలూరు మండలాల్లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 7511 లీటర్ల సారా ప్యాకెట్లను బుధవారం ధ్వంసం చేశారు.ఎక్సైజ్, పోలీసు అధికారుల సమక్షంలోనే ఈ సారా ప్యాకెట్లను ధ్వంసం చేశారు.